
సాక్షి ఆదిలాబాద్

గురువారం । 1 । జూన్ । 2023

కొత్త బంగారులోకం



ఇప్పటి వరకూ పాఠశాల చదువు.. ఇకనుంచీ కళాశాల వాతావరణం. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. జీవితాన్ని మలుపులు తిప్పే కీలక దశ. ఈ క్రమంలో ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే జీవితం కొత్త బంగారు లోకం అవుతుంది. 8లో▸

నర్సరీల పరిశీలన



ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని హరిత వనం పార్కు, దుర్గనగర్‌లో సెంట్రల్ నర్సరీలను ట్రెయినీ కలెక్టర్ శ్రీజ బుధవారం సందర్శించారు. రిజర్వ్డ్ ఫారెస్టు, బ్లాక్ ప్లాంటేషన్, మియావాకి ప్లాంట్‌ల వివరాలను ఎఫ్‌బీవో ప్రశాంత్‌ను అడిగి తెలుసుకున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 42.0/29.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పొగాకు నియంత్రణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: పొగాకు నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టొబాకో, గుట్కా, సిగరేట్‌తో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. సమావేశంలో మలేరియా నివారణ అధికారి శ్రీధర్, క్షయ నివారణ అధికారి శ్రీకాంత్, అదనపు డీఎంహెచ్‌వో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన టీయూపీఎస్ నాయకులు



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డిని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీయూపీఎస్) జిల్లా నాయకులు బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రశిక్షణవర్గలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. వీరిలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలబోజు గోపీకృష్ణ, శ్రీనివాస్‌రావు, నవీన్, రాజేశ్వర్, మధు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



కరపత్రం అందిస్తున్న సాజిద్‌ఖాన్, సుజాత

ఆదిలాబాద్‌అర్బన్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఆదిలాబాద్ పట్టణాభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, నాయకులతో కలిసి పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో బుధవారం పర్యటించారు. గడప గడపకు మన కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా కాలనీలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, శ్రీధర్, నగేష్, సంతోష్, అశోక్, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, వృకోధర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో బుధవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో విద్య, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం పలు తీర్మానాలు చేశారు. పీఆర్సీని జూలైలో నియమించాలని, అలాగే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఐటీడీఏలో ఏజెన్సీ డీఈవో పోస్టు పునరుద్ధరించాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలలకు స్కావెంజర్లను నియమించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు శ్యాముల్, నారాయణ, కోశారావు, నాగేందర్, గౌసొద్దీన్, సుధాకర్, దిలీప్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అర్బన్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు (ఫైల్)

బడి బాట పట్టేనా?

- ఎల్లుండి నుంచి ఈ నెల 17 వరకు 'జయశంకర్ బడిబాట'
- బడీడు పిల్లల్ని పాఠశాలలో చేర్పించేందుకు విద్యాశాఖ కసరత్తు
- ఏర్పాట్లలో అధికారులు

జిల్లాలో మొత్తం పాఠశాలలు 1,439
విద్యార్థుల సంఖ్య 1,39,421
ఈ ఏడాది అంగన్‌వాడీ నుంచి పాఠశాలల్లో చేరే విద్యార్థులు 12,568
బడిబయట పిల్లలు 189

ఆదిలాబాద్‌టౌన్: బడీడుతో పాటు బడిబయట పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యా శాఖ కసరత్తు ప్రారంభించింది. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట పేరిట కార్యక్రమాన్ని చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. ఈనెల 3నుంచి 17 వరకు కొనసాగనుంది. ఇందులో భాగంగా 3 నుంచి 9వ తేది వరకు ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థులను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపడతారు. అయితే ఇప్పటికే ప్రైవేట్ యాజమాన్యాలు గ్రామాల్లో అడ్మిషన్ల ప్రక్రియ షురూ చేశారు. సర్కారు బడుల్లో మాత్రం ఏటా విద్యాసంవత్సరం పునఃప్రారంభమయ్యే ముందు నామమాత్రంగా కార్యక్రమాలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. ఈసారైనా పూర్తిస్థాయిలో పిల్లలను బడిలో చేర్పిస్తారా అనేది వేచి చూడాల్సిందే.

బడిబయట పిల్లలు బడిలో చేరేనా..

పాఠశాలలు పునఃప్రారంభమయ్యే విద్యా సంవత్సరం ఏటా విద్యాశాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ బడిబయట ఉన్న పిల్లల సంఖ్య తగ్గడం లేదు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాలతో పాటు చెత్తకుప్పల వెంట, హోటళ్లు, లాడ్జీలు, తదితర పరిశ్రమల్లో దర్శనమిస్తున్నారు. బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించడమే ముఖ్య ఉద్దేశం అయినప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యపడటం లేదు. గతేడాది నుంచి పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం తరగతులు ప్రారంభించినప్పటికీ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సర్కారు బడుల్లో చేరడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య, సౌకర్యాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు తెలియజేయాల్సి ఉన్నప్పటికీ అలా జరగడం లేదని తెలుస్తోంది. ఉపాధ్యాయుల కొరత కారణంగా తల్లిదండ్రులు సర్కారు బడుల్లో చేర్పించేందుకు మొగ్గు చూపడం లేదని ప్రచారం సాగుతోంది. కేవలం పక్షంపాటు కార్యక్రమాలు నిర్వహించి సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితిలో మార్పు కానరావడం లేదని తెలుస్తోంది. అనధికారింగా జిల్లాలో 500కు పైగానే బడిబయట పిల్లలు ఉన్నప్పటికీ అధికారుల లెక్కల ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలు 189 మంది ఉన్నట్లు చెబుతున్నారు. వీరిలో 109 బాలురు, 80 మంది బాలికలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. అలాగే 15 నుంచి 19 ఏళ్ల లోపు వారు మొత్తం 91 మంది ఉండగా, ఇందులో బాలురు 55, బాలికలు 36 మంది ఉన్నట్లు చెబుతున్నారు.

బడిబాట ప్రణాళిక ఇలా..

బడీడు పిల్లల్ని బడిలో చేర్పించడమే లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 3 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 1న పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించి కార్యక్రమ ప్రణాళిక తయారు చేయనున్నారు. 3 నుంచి 9 వరకు అన్ని గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. ఉదయం 7నుంచి 11 గంటల వరకు ఉపాధ్యాయులు బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శిస్తూ ఇంటింటా ప్రచారం చేపట్టాలి. 12 నుంచి 17 వరకు నిర్దేశించిన రోజువారి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి. అదేరోజు మన ఊరు–మనబడి, 13న తొలిమెట్టు, 14న సామూహిక అక్షరభ్యాసం, 15న దివ్యాంగుల బడిబయట పిల్లల నమోదు, 16న ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం, 17న బాలిక విద్య, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా బడీడు పిల్లల్ని సమీప పాఠశాలల్లో నమోదు చేయడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పైబడిన వారిని గుర్తించి ఒకటో తరగతిలో చేర్పించడం, 5, 7 తరగతులు పూర్తయిన వారిని పైతరగతుల్లో చేర్పించడం, తదితర కార్యక్రమాలు నిర్వహించాలి.

6 నుంచి 14 ఏళ్లలోపు బడిబయట పిల్లల వివరాలు మండలాల వారీగా..

మండలం	బాలురు	బాలికలు	మొత్తం
ఆదిలాబాద్‌రూరల్	00	06	06
ఆదిలాబాద్‌అర్బన్	05	06	11
బజార్‌హత్నూర్	06	00	06
బేల	05	02	07
భీంపూర్	05	02	07
బోథ్	05	04	09
ఇచ్చోడ	03	02	05
గాదిగూడ	09	03	12
గుడిహత్నూర్	08	04	12
ఇంద్రవెల్లి	12	19	31
జైనథ్	00	00	00
మావల	04	00	04
నార్నూర్	04	05	09
నేరడిగొండ	02	11	13
సిరికొండ	03	00	03
తలమడుగు	03	02	05
తాంసి	05	02	07
ఉట్నూర్	30	12	42
మొత్తం	109	80	189

అట్టహాసంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్ రాజ్
- దశాబ్ది ఉత్సవాలపై అధికారులతో సమీక్ష

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. అవతరణ వేడుకల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా అమర వీరులకు నివాళి, పతాకావిష్కరణ తదితర కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జూన్ 3న రైతు దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆయా రైతు వేదికలను అలంకరించి పండగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతీరైతు వేదిక వద్ద 1000 మంది రైతులు పాల్గొనేలా చూడాలన్నారు. వాహనాలు, ఎడ్లబండ్లను అందంగా అలంకరించి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఉదయం 10 గంటలకు వేదికల వద్దకు చేరుకోవాలన్నారు. రైతులకు పంటలపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమ అనంతరం భోజన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన షామియానాలు, కుర్చీలు, తాగునీరు వంటి సదుపాయాలు సమకూర్చాలని సూచించారు. జూన్ 4న సురక్ష దినోత్సవం, 5న విద్యుత్ విజయోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. విద్యుత్ విజయోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో రైతులు, వినియోగదారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు వెయ్యి మందితో కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని సబ్ స్టేషన్లను 21 రోజుల పాటు విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. 8న నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో చెరువుల వద్ద సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు చెరువుల పండుగ నిర్వహించాలన్నారు. కార్యక్రమం అనంతరం రాత్రి భోజనాలకు విద్యుత్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో రాథోడ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంను ఈ నెల 2న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. వేడుకలకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఉదయం 8.35 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద గల తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద, 8.40 గంటలకు తెలంగాణ చౌక్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు జాతీయ పతకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారని తెలిపారు.

ప్రత్యేక అధికారుల నియామకం

రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈనెల 3న నిర్వహించే రైతు దినోత్సవం జయప్రదం చేసేందుకు ఆయా మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఎంపీడీవో, తహసీల్దార్, డీఈ, ఏఈ స్థాయి గల అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి ఎన్‌పీడీసీఎల్ కాంట్రాక్టర్ల సమ్మె

- పెండింగ్ బిల్లుల విడుదలకు డిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సంఘం అధ్యక్షుడు అశోక్

కైలాస్‌నగర్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నేటి (ఈనెల1) నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇండ్ల అశోక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ శాఖకు సంబంధించి తాము చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.ఎస్ఎస్ఆర్ పాత రేట్లే ఉన్నాయని దీంతో కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాత ధరలు మార్పు చేసి పెరుగుతున్న ధరల కనుగుణంగా సవరించాలన్నారు. బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో చాలామంది కాంట్రాక్టర్లు అప్పుల పాలు కావాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. చేసిన పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. అప్పటి వరకు విద్యుత్‌శాఖకు సంబంధించిన పనులన్నింటిని నిలిపివేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ నర్సింగ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎన్‌ఎంసీ తనిఖీ



వైద్య సేవల వివరాలు తెలుసుకుంటున్న ప్రొఫెసర్ విపిన్ గోయల్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో ఎన్ఎంసీ బుధవారం తనిఖీ చేపట్టింది. పల్మనాలజీలో పీజీ ప్రవేశాల కోసం రిమ్స్ అధికారులు ఇప్పటికే నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ)కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెస్పిరేటరీ మెడిసిన్ ప్రభుత్వ మెడికల్ కళాశాల నల్హార్ హర్యానాకు చెందిన ప్రొఫెసర్ విపిన్ గోయల్ రిమ్స్‌లో తనిఖీ చేపట్టారు. పల్మనాలజీ శాఖకు సంబంధించి ఎన్ని వెంటిలెటర్లు ఉన్నాయి, ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ ఎలా ఉంది.. ఆక్సిజన్, టీబీ పేషెంట్లకు ఏ విధంగా వైద్య సేవలు అందుతున్నాయనే వివరాలు తెలుసుకున్నారు. ఐదు పీజీ సీట్లకు దరఖాస్తు చేసుకోగా, ఈయన నివేదిక ఆధారంగా మంజూరు కానున్నాయి. ఈయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, పల్మనాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ సందీప్ జాదవ్, రమేశ్ పవార్, సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ఆదిలాబాద్: చిన్నారుల సాంస్కృతిక నృత్యాలతో బాల కేంద్రం హోరెత్తింది. జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో నెల రోజులుగా సాగుతున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. చిన్నారులు అభ్యసించిన అంశాలు, నృత్యాలను ప్రదర్శించారు. విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, నారాయణ హాజరై మాట్లాడారు. చిన్నారుల్లోని సృజనాత్మకత వెలికి తీసేందుకు శిక్షణ శిబిరాలు తోడ్పడతాయన్నారు. బాలకేంద్రం పర్యవేక్షకుడు రవి పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

వడివడిగా పనులు

- జిల్లాలో రూ.1.52 కోట్ల నిధులతో..
- దత్తత గ్రామాల్లో పరిష్కారమవుతున్న విద్యుత్ సమస్యలు
- నాణ్యమైన కరెంట్ అందించడమే లక్ష్యంగా ఆ శాఖ చర్యలు

జిల్లాలో దత్తత గ్రామాల్లో గుర్తించి, పరిష్కరిస్తున్న విద్యుత్ సమస్యలు

దత్తత గ్రామాలు	24
గుర్తించిన లూజ్‌వైర్లు	339
వంగిన స్తంభాలు	205
అవసరమైన మిడిల్ పోల్స్	396
రోడ్ క్రాసింగ్ లైన్లు	61
చెట్లపై ఉన్న విద్యుత్‌లైన్లు	128
సపోర్టింగ్ స్తంభాలు	204
ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు	21
ఏబీ స్విచ్‌లు	35
కెపాసిటర్లు	314



తలమడుగు మండల కేంద్రం సమీపంలో ఏర్పాటు చేస్తున్న కొత్త విద్యుత్ స్తంభం

కైలాస్‌నగర్: జిల్లాలోని దత్తత గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేలా ఎన్‌పీడీసీఎల్ చర్యలు చేపడుతోంది. గ్రామాలను దత్తత తీసుకున్న అధికారులు గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు జిల్లాకు రూ.1.52 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయింది. వర్షాకాలం సమీపిస్తుండటంతో కరెంట్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ముమ్మరంగా పనులు చేపడుతున్నారు.

సమస్యల పరిష్కారానికి దత్తత ప్రయోగం

గ్రామాలు, పట్టణంలోని వార్డుల పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్‌శాఖ అధికారులు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని క్షేత్రస్థాయిలో సమస్యలపై సర్వే చేయాలని ఆ సంస్థ సీఎండీ ఆదేశించారు. జిల్లాలో 18 మండలాలుండగా విద్యుత్‌శాఖకు సంబంధించి ఐదు డివిజన్ల పరిధిలో 20 సెక్షన్లు ఉన్నాయి. సీఎండీ ఆదేశాల మేరకు తొలుత జిల్లాలోని 24 గ్రామాలను డీఈలు, ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు దత్తత తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో సర్వే చేపట్టిన సదరు అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా నిధులతో సంబంధం లేని పనులను పూర్తి చేశారు. ఆర్థికపరమైన పనులను గుర్తించి వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు.

పరిష్కారమవుతున్న సమస్యలు

దత్తత గ్రామాల్లో సర్వే నిర్వహించిన అధికారులు ఆర్థికపరమైన సమస్యలను గుర్తించారు. పలుచోట్ల విద్యుత్ తీగలు వదులుగా ఉండటం, స్తంభాలు వంగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు తక్కువ ఎత్తులో ఉండటం, మిడిల్ పోల్స్ వేయాల్సి ఉండటాన్ని గుర్తించారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌లు, 11కేవీ, ఎల్‌టీ పంపిణీ లైన్లలో ఉన్న లోపాలు, ఓవర్‌లోడ్‌లో ఉన్న నియంత్రికలు, వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్ల బిగింపు, వీధి దీపాలకు మీటర్లు బిగించడంతో పాటు వంగిన స్తంభాలను సరిచేయడం, రోడ్ క్రాసింగ్ చోట్ల స్తంభాలు వేయడం, అవసరమైన చోట మూడోలైన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించారు. తదనుగుణంగా రూ.1.52 కోట్ల నిధులు విడుదలయ్యాయి. వాటికి టెండర్లు నిర్వహించిన అధికారులు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

చురుగ్గా పనులు ..

దత్తత గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, వినియోగారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నాం. రూ.1.52 కోట్ల విలువైన పనులకు టెండర్లను నిర్వహించి 24 గ్రామాల్లో అవసరమైన పనులు చేపట్టాం. చురుగ్గా సాగుతున్నాయి. వర్షాకాలంలో వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పనులు చేపడుతున్నాం.

– సంపత్‌కుమార్, ఎస్ఈ, ఆదిలాబాద్

క్లుప్తంగా

న్యాయం చేయాలని వైస్ ఎంపీపీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న లింబాజీ

బోథ్: బోథ్ మండల సర్వసభ్య సమావేశం అనంతరం వైస్ ఎంపీపీ లింబాజీ నిరసన వ్యక్తం చేశారు. తాను కాంట్రాక్టు పనికోసం ఎంపీపీ తుల శ్రీనివాస్‌కు రూ. 50 వేలు ఇచ్చానని ఆరోపించాడు. సర్వసభ్య సమావేశం ముగిసినట్లు ఎంపీపీ ప్రకటించడంతో లింబాజీ అక్కడే కూర్చున్నాడు. అందరూ వెళ్లి పోయినా.. అరగంట పాటు కూర్చుని నిరసన వ్యక్తం చేశాడు. పోలీసులు వచ్చి అతడిని సమావేశ గది నుంచి బయటకు తీసుకొచ్చారు. తన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ తాను నాకు డబ్బులు తీసుకోలేదని, ఇదివరకు ఇలాంటి అసత్యపు ఆరోపణలు చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశానన్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



శిరీష (ఫైల్)

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని పీచరలో మార్చి 11న ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పీచర గ్రామానికి చెందిన గుడ్ల శిరీష (22)కు సారంగాపూర్ మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన విజయ్‌తో ఆర్నెళ్ల క్రితం వివాహమైంది. అత్తింట్లో వేధింపులు భరించలేక పుట్టింటికి వచ్చింది. మార్చి 11న ఇంట్లో ఎవరూలేని సమయంలో హార్పిక్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ముత్తన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి పైనుంచి పడి మేస్త్రీకి గాయాలు



గాయాలపాలైన మేస్త్రీ రాజమల్లు

బోథ్: మండల కేంద్రంలోని ఓ ఇంటి నిర్మాణం పైకప్పు వేసేందుకు నిర్మిస్తున్న సెంట్రింగ్ పై నుంచి గ్రామానికి చెందిన మేస్త్రీ రాజమల్లు ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. సెంట్రింగ్ పనులు చేస్తున్న క్రమంలో కిందకు జారి పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోంచి రాగి తీగ చోరీ

కడెం(ఖానాపూర్): మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ సీడ్ ఫాంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోంచి రాగి తీగ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. వ్యవసాయాధికారుల ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్సై రాజు, ఏఈఈ సుమన్‌కుమార్ సీడ్ ఫాంను సందర్శించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్త బంగారులోకం





- టీనేజర్లు ఆకర్షణకు గురికావద్దు
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఇంటర్‌లో గాడితప్పితే భవిష్యత్ అంధకారమే
- క్రమశిక్షణతో సాగితేనే విజయం సొంతం
- జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: ఇప్పటి వరకూ పాఠశాల చదువు.. ఇకనుంచీ కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం.. ఈ క్రమంలో కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థుల్లో పరిచయాలు.. కొత్త వాతావరణం, కొత్త పరిసరాలు, సరికొత్త ఆలోచనలు.. అన్నీ కొత్తదనాన్ని ఇచ్చే అనుభవాలే. ఇష్టపడి కళాశాలల్లో అడుగుపెట్టే విద్యార్థులకు ఇవన్నీ వింతగా కనిపిస్తాయి. టీనేజ్‌లో అత్యంత కీలక సమయమిది. అంతేకాదు.. జీవితాన్ని మలుపులు తిప్పేది ఇంటర్ దశనే. ఏమాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా జీవితం మన చేతిలోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నిలుస్తుంది. ఇంటర్‌లో చేరే కొత్త విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే ఇంటర్ దశ కొత్త బంగారు లోకం అవుతుంది. భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 31,959 మంది విద్యార్థులు పదోతరగతిలో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరనున్నారు.

స్నేహం ప్రభావితం..

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్దీ ఉన్నత భావాలున్న వారితో స్నేహం కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది.. లేదా పశ్చాత్తాప పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, ప్రజలపై గౌరవం, సమాజం మీదా అవగాహన, లెక్చరర్లపై సదభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. సిగరేట్లు, గుట్కాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. ఇలాంటి వాటికి ఇంటర్ దశలోనే బీజాలు పడతాయి. పరిచయం ఉన్నవారు, అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్ చేయవద్దు. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావం, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయనం అంటూ మనస్సును కలుషితం చేసుకోవద్దు.

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు

జిల్లా	విద్యార్థులు
ఆదిలాబాద్	9,366
మంచిర్యాల	8,552
నిర్మల్	8,980
కుమురంభీం	5,061

చదువుకే తొలి ప్రాధాన్యం..

ఇంటర్ విద్యార్థులు ఎన్నో ఆకర్షణలకు లోనవుతారు. అయితే ఈ దశలో అందరికీ చదువే తొలి ప్రాధాన్యత కావాలి. తమ జీవితం అల్లరి పాలయ్యేలా ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీలు ఎగ్గొట్టడం, హీరోయిజం చేయడం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావాలి. పాఠ్యాంశాలపై దృష్టి సారించాలి. లెక్చరర్లు ఇచ్చే నోట్స్ ఎప్పటికప్పుడు రాసుకోవాలి. పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. స్నేహితులతో కలిసి గ్రూప్ స్టడీ చేయడం అత్యంత కీలకం.

ఆకర్షణకు లోనుకావొద్దు..



ఇంటర్ చదివే విద్యార్థులు ఎక్కువగా ఆకర్షణకు లోనవుతారు. దీంతో చదువుపై శ్రద్ధ కనబర్చలేరు. చిన్న వయస్సులోనే ప్రేమ, పెళ్లితో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి పెట్టాలి. భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలి.

– డాక్టర్ రమ, గైనకాలజిస్ట్

ఏదో తెలియని లోకంలా..



పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఇంటర్‌కు రాగానే ఏదో తెలియని లోకంలా విహరిస్తారు. స్వేచ్ఛ జీవిగా భావిస్తారు. అప్పుడే వారి ఆలోచనల్లో మార్పులు వస్తాయి. కాలేజీ చదువు ఎంతో విలువైనది. ముఖ్యంగా చెడు వ్యసనాలు, సిగరేట్లు, మద్యం సేవించడం, కళాశాలకు డుమ్మా కొట్టడం వంటి వాటికి గురికాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. అప్పుడప్పుడు తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లి పిల్లల తీరును పర్యవేక్షించాలి.

– డాక్టర్ ఓంప్రకాశ్, సైకియాట్రిస్ట్

భవిష్యత్ అంధకారం చేసుకోవద్దు



ఎస్సెస్సీ తర్వాత కొత్త ప్రపంచంలోకి అడుగుపెడతారు. ఇంటర్‌లో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలి. ప్రేమ, సినిమా, షికార్ల వైపు దృష్టి మళ్లే వయస్సు ఇది. అటుగా దృష్టిసారిస్తే భవిష్యత్ అంధకారం అవుతుంది. పదో తరగతి వరకు ఉపాధ్యాయులు స్థానికంగా ఉండడంతో విద్యార్థులకు భయం అనేది ఉంటుంది.

– సూర్యప్రకాశ్, ప్రిన్సిపాల్

‘ఎంపీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి’



మాట్లాడుతున్న పాస్టర్ డానియల్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మతమార్పిడి చేస్తే బుల్లెట్లు దింపుతామని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు పాస్టర్లను హెచ్చరించడం సరికాదని పాస్టర్స్ అసోసియేషన్ ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు డానియల్, కార్యదర్శి జోసెఫ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపీ వెంటనే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని పాస్టర్లకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో సోయం బాపురావు ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. రాజ్యాంగబద్ధంగా సమాజ సేవ చేస్తున్న పాస్టర్లు మతమార్పిడిలకు పూనుకోవడం లేదన్నారు. తాము ఎవరినైనా ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి కానీ హెచ్చరించడం సరికాదన్నారు. ఎంపీ తీరు మానవ హక్కులకు భంగం కలిగించడమే అవుతుందన్నారు. సమావేశంలో రాజారత్నం, తిమోతి ఏలియా, అంద్రుస్, పీటర్, తదితరులు పాల్గొన్నారు.

‘క్రైస్తవులపై అనుచితంగా మాట్లాడడం సరికాదు’

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవల జరిగిన ఓ సభలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు క్రైస్తవులపై అనుచితంగా మాట్లాడడం సరైంది కాదని క్రైస్తవ సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభలో ఎంపీ మాట్లాడుతూ ‘తుటాలు దించుతాం’ అని మాట్లాడిన మాటలను ఉమ్మడి జిల్లా పాస్టర్లు, క్రైస్తవ నాయకులందరూ ముక్త కంఠంతో ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే స్థాయిలో ఉండి మత స్వేచ్ఛను హరించే విధంగా, మత కల్లోలాలు రేపేవిధంగా మాట్లాడడం బాధకరమన్నారు. ఎంపీ మాట్లాడిన మాటలన్నింటిని రుజువు చేయాలని, లేదంటే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమాయకులైన గిరిజనులను తన లబ్ధి కోసం రెచ్చగొడుతున్న ఎంపీపై తక్షణమే కేసు నమోదు చేసి పదవీ నుంచి డిస్క్వాలిఫై చేసి తమ కు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బి.చంద్రశేఖర్, ఏ. ఏలియా, ఎస్.ఎస్ అంద్రూస్, బి.జయంత్‌కుమార్, బి.పీటర్ ఉన్నారు.

పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు

- పాటిస్తే అధిక దిగుబడులు
- వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్



ఎదులాపురం: ఖరీఫ్ సమీపిస్తున్న తరుణంలో పత్తి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ రైతులకు వివరించారు.

రైతులు పాటించాల్సిన సూచనలు

- వర్షాధారంగా ప్రత్తి పంటను నల్లరేగడి భూముల్లో 60 నుంచి 70 మిల్లీమీటర్లు, ఎర్రచెల్క భూముల్లో 50 నుంచి 60 మిల్లీమీటర్ల వర్షపాతం సమోదైన తర్వాతే విత్తుకోవాలి.
- జూన్ 15 లోగా విత్తితే దిగుబడులు ఎక్కువగా వస్తాయి. జూలై 15 దాటితే వీలైనంత వరకు పత్తిని విత్తరాదు.
- తేలిక నేలల్లో తప్పనిసరిగా పత్తిని సాగు చేసినప్పుడు మొక్కల సంఖ్య మామూలు కంటే ఎక్కువగా ఉండేటట్లు దగ్గరగా విత్తుకోవాలి.
- నేల స్వభావాన్ని, నీటి వసతులను దృష్టిలో ఉంచుకుని సరైన రకాన్ని ఎంపిక చేసుకోవాలి. వీలైతే వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలి.
- విత్తనం మోతాదు హైబ్రిడ్ వంగడాలకు ఎకరానికి కిలో సరిపోతుంది. అదే సూటి రకాలకైతే 2 కిలోల విత్తనం, అధిక సాంద్రతలో సాగు చేసినప్పుడు ఎకరానికి 3 నుంచి 5 కిలోల విత్తనం అవసరం అవుతుంది.

విత్తన శుద్ధి తప్పనిసరి..

రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలి. కిలో విత్తనానికి మొదట ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యూఎస్ 5 గ్రాములు (లేదా) 600 ఎఫ్ఎస్ 5 మిల్లీలీటర్లు (లేదా) థయమిథాక్సామ్ 70 శాతం డబ్ల్యూఎస్ 4 గ్రాములు కలిపిన తర్వాత 10 గ్రాముల ట్రైకోడేర్మా విరిడి (లేదా) సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ లేదా కార్బాక్సిన్ + థైరము 2.5 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేయాలి.

- సాధారణ/సూటి రకాలకు ఎకరాకు 36 కిలోల నత్రజని, 18 కిలోల భాస్వరం, 18 కిలోల పోటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. హైబ్రిడ్ రకాలకు ఎకరాకు 48 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం 24 కిలోల పోటాష్ నిచ్చే ఎరువులు వేయాలి.
- సూటి రకాలకు ఎకరానికి 50 కిలోల డీఏపీ (లేదా) 100 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ విత్తేటప్పుడు వేయాలి. పై పాటుగా అనగా విత్తిన 30, 60, 90 రోజుల్లో 25 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 3 సార్లు మొక్కకు అందించాలి.
- హైబ్రిడ్ రకాలకు ఎకరానికి 50 కిలోల డీఏపీ (లేదా) 150 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ విత్తేటప్పుడు వేయాలి. పై పాటుగా అనగా విత్తిన 20, 40, 60, 80 రోజుల్లో 25 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ నాలుగుసార్లు మొక్కకు అందించాలి.
- నత్రజని ఎరువులను సరైన మోతాదులో సకాలంలో వేయాలి. లేదంటే పురుగుల ఉధృతి ఎక్కువవుతుంది.
- ఒకే పొలంలో పంట మార్పిడి చేయకుండా పత్తిని అనేక సంవత్సరాలు పండించడం వల్ల పైరుపై జింక్, బోరాన్, మెగ్నీషియం వంటి సూక్ష్మ పోషకాల లోపం కనిపిస్తుంది. పూత, పిందెరాలడం, పండాకు తెగులు వంటి వాటికి అవకాశం ఉంటుంది. అందుకని పంట మార్పిడి చేపట్టాలి.

‘ప్యారాచూట్ నాయకులకు టికెట్లు ఇవ్వొద్దు’



మాట్లాడుతున్న ఆశావహులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణలో కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని భావించి పార్టీలో చేరిన ప్యారాచూట్ నాయకులకు టికెట్ ఇస్తే సహించేదిలేదని ఆశావాహులు హెచ్చరించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు రాథోడ్ చారులత, పెందూర్ ప్రభాకర్, జాదవ్ సునీల్ నాయక్ మాట్లాడుతూ తమతో పాటు నియోజకవర్గంలో వెడ్మ బొజ్జు, పుర్క బాపురావు, వినోద్‌కుమార్ పార్టీ టికెట్లు ఆశిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ జెండా మోస్తూ పార్టీ కార్యక్రమాలు చేపడుతున్న తమకు ప్యారాచూట్ నాయకుల వల్ల గుర్తింపు లేకుండా పోయిందన్నారు. టీపీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తమ ఆరుగురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థి విజయానికి కృషి చేస్తామన్నారు. తమ విన్నపాలు కాదని అధిష్టానం ఇతరులకు టికెట్ ఇస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్బాల్, నాయకులు కోమటి రెడ్డి మల్లారెడ్డి, అర్క సీతారాం పాల్గొన్నారు.

కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



లారీ ఢీకొనడంతో విరిగిన విద్యుత్ స్తంభం

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో ధాన్యం బస్తాలను తరలిస్తున్న లారీ బుధవారం రోడ్డుపక్కనే గల విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో స్తంభం లారీపై పడింది. ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. మద్దికల్ గ్రామంలోని ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు చేసిన బస్తాలను లారీల ద్వారా కరీంనగర్ జిల్లాలోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు పరిధిలోనే స్తంభం ఉండడంతో దానిని తప్పించే ప్రయత్నం చేసినప్పటికీ బస్తాలు తగిలి స్తంభం లారీపై పడింది. విద్యుత్ స్తంభం విరిగిన అనంతరం లారీని పక్కకు తీసేందుకు ప్రయత్నించగా విద్యుత్ లైను మొత్తం కిందపడిపోయే ప్రమాదం ఉండడంతో లారీని అలాగే ఉంచారు.

చెప్పినా పట్టించుకోవడం లేదు...

గ్రామంలో రోడ్డు పరిధిలోని విద్యుత్ స్తంభాలను తొలగించి కొంత దూరంలో ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికే స్పందిస్తే ఈ ప్రమాదం జరిగేది కాదు.

– ఓడేటీ వాణి, సర్పంచ్, మద్దికల్

ప్రతిఒక్కరూ బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలి

- జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్



విగ్రహానికి పూజలు చేస్తున్న జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే

నార్నూర్(ఆసిఫాబాద్): గౌతమ బుద్ధుడు చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బుధవారం మండలంలోని దుప్పాపూర్‌లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి గౌతమ బుద్ధుడు, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీచైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిమార్గాన్ని అనుసరించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ బుద్ధవిహార్‌కు కమ్యూనిటీహాల్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. విహార్‌లో విశాలమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. లక్ష్యానికి పేదరికం అడ్డురాదని రెబ్బెనకు చెందిన దళిత బిడ్డ రెవయ్య సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించి నిరూపించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, సర్పంచ్ కనక సేవంతబాయి ప్రభాకర్, బుద్ధవిహార్ కమిటీ అధ్యక్షుడు శ్రీరంగ్ వాఘ్మారే, కనక కన్ను, దుర్గం ట్రస్టు చైర్మన్, అంబేద్కర్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకుడు యునుస్ అక్బానీ, ఎంపీటీసీ పరమేశ్వర్, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాహుల్ అమెరికా పర్యటనలో ‘కంది’



రాహుల్‌గాంధీని సత్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో ఎన్‌ఆర్‌ఐలతో సమావేశమయ్యారు. బుధవారం శాన్‌ఫ్రాన్సిస్‌కోలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి రాహుల్ గాంధీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ అధ్యక్షుడు మహేందర్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుయాష్కిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో ప్రతిభ



స్వర్ణ పతకంతో నితిన్



కాంస్య పతకంతో మాలిక్

ఆదిలాబాద్: సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. బాక్సింగ్ పోటీల్లో 46–48 కేజీల విభాగంలో బి.నితిన్ స్వర్ణ పతకం, 51–54 కేజీల విభాగంలో ఎండి.మాలిక్ కాంస్య పతకం సాధించారు. క్రీడాకారులను జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, బాక్సింగ్ కోచ్ ఆనంద్ భాస్కర్ అభినందించారు.

ప్రమాదవశాత్తు పశువుల పాక దగ్ధం



మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని గుర్రాలతాండలో కటక్‌వాల్ సుభాష్‌కు చెందిన పశువుల పాకకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం పశువుల పాక పక్క నుంచి పొగ రావడాన్ని గమనించిన సుభాష్ వెంటనే అక్కడికి వెళ్లి చూడగా పాక పక్కన ఉన్న గడ్డి కాలుతోంది. పశువుల పాక పక్కనే గడ్డి ఉండటంతో పాకకు కూడా మంటలు వ్యాపించాయి. కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలు ఆర్పివేశారు. పశువుల మేతకోసం ఉంచిన గడ్డి పూర్తితో పాటు పాక కూడా కాలిపోయిందని, ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

చెట్టును ఢీకొన్న లారీ... డ్రైవర్ మృతి



చెట్టును ఢీకొన్న లారీ

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట బస్టాప్ వద్ద బుధవారం అదుపుతప్పి ఇసుక లారీ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కృష్ణస్వామి(35) మృతి చెందాడు. ఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం.. చెన్నూర్ నుంచి ఇసుక లోడ్‌తో నిర్మల్ వెళ్తున్న లారీ అదుపు తప్పి గుల్లకోట వద్ద రోడ్డుపక్కన ఉన్న చెట్టును వేగంగా ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. ఇందులో డ్రైవర్ ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మృతదేహాన్ని జేసీబీ సాయంతో బయటకు తీశారు. కృష్ణస్వామి నిర్మల్ పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



రాజు మృతదేహం

తాండూర్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఓ యువకుడు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... కిష్టంపేట గ్రామానికి చెందిన రాజు(20) కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కామిని శ్రీనివాస్ ఇంటి నిర్మాణ పనులకు కూలీగా వెళ్తున్నాడు. బుధవారం పనులు ముగించుకుని కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు విద్యుత్ మోటారు ఆన్‌చేయగా విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి సిడాం రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఒకరి మృతి

చింతలమానెపల్లి(సిర్పూర్): కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలంలోని బాబాసాగర్ గ్రామానికి నెర్పెల్లి పెంటయ్య(58) బుధవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామంలోని బంధువులను కలిసేందుకు మధ్యాహ్నం ఇంటి నుండి నడుచుకుంటూ బయలుదేరాడు. స్థానిక చెరువు కట్ట వద్ద పడిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసే సరికి మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య కమల, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.